క్లుప్తంగా

పరామర్శ



రమణను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం : మండలంలో గెడ్డవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ముదిలి రమణను పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన రమణ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రాజేష్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు గెడ్డవలసలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, ముదిలి జనార్ధనరావు, బూరాడ నర్సింహులు తదితరులు ఉన్నారు.

తెర్లాం ఎంపీడీఓగా శంబంగి



ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణకు స్వాగతం పలుకున్న ఈఓపీఆర్‌డీ

తెర్లాం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా శంబంగి రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు మండల ఈఓపీఆర్‌డీ నీలిమ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. గతంలో తెర్లాం ఎంపీడీఓగా పనిచేసిన రామకృష్ణ ఎన్నికల బదిలీల్లో భాగంగా పాలకొండ ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఇటీవల ప్రభుత్వం ఎన్నికల్లో బదిలీపై వెళ్లిన ఎంపీడీఓలను తిరిగి పాత స్థానాలకు పంపించేందుకు జీఓ విడుదల చేయడంతో ఆయన బుధవారం తిరిగి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఎంపీడీఓగా పని చేసిన బి.మధుసూదనరావు తిరిగి శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

1300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులోకి 1300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ప్రాజెక్టు వద్ద 64.07 మీటర్ల లెవెల్ నీటి నిల్వ నమోదైంది. ఒక గేటు ఎత్తి 1110 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెట్టగా, కుడి, ఎడమ కాలువల ద్వారా 660 క్యూసెక్కుల నీరు పంట పొలాలకు సరఫరా చేస్తున్నట్లు ఏఈ నితిన్ తెలిపారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపి

రేగిడి : స్థానిక భవిత కేంద్రం వద్ద మండలంలోని దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరిపి డాక్టర్ రమాచంద్రిక బుధవారం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతీ రోజు చిన్నారులతో ఫిజియోథెరిపి చేయిస్తే కొన్నాళ్లకు అంగ వైకల్యం సమసిపోయే అవకాశం ఉందని వివరించారు. ఎటువంటి ఖర్చు లేకుండా ఇంటి వద్ద ఫిజియోథెరిపి చేయించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, సహిత విద్య ఉపాధ్యాయులు యు.మహేశ్వరి, టి.రాజేష్, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పనులకు ప్రాధాన్యత

రాజాం : గ్రామాల్లో పంట పొలాల్లో సాగునీటి కాలువల్లో వేతనదారులకు ఉపాధి పనులు కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్‌లు దృష్టి సారించాలని, ఈ మేరకు పంచాయతీల్లో తీర్మానాలు, పనులు గుర్తింపు కార్యక్రమాలు ముందుగా చేపడుతుండాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉపాధి పనులకు డిమాండ్ తగ్గడంపై ఆరా తీశారు. రైతులు ఉద్యానవన పంటలు ఉపాధి పనుల్లో భాగంగా చేపట్టేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆగస్టు 15 సందర్భంగా ప్రతీ పంచాయతీలో తల్లి పేరుతో ఒక్క మొక్కను నాటాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, ఎన్ఆర్‌ఈజీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేత బాలికోన్నత పాఠశాల

రాజాం : స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. రెడ్ రిబ్బన్ నిర్వహించిన ఈ పోటీల్లో రాజాం పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాఠశాలలు వారీగా పాల్గొన్నారు. ఇందులో ప్రథమ స్థానంలో రాజాం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల(సారధి) విద్యార్థులు నిలవగా, ద్వితీయ స్థానంలో డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తృతీయ స్థానంలో రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచినట్లు ఎంఈఓ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రథమ స్థానంలో నిలిచిన సారధి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో రాజాం మండల తరఫున పాల్గొంటారని వెల్లడించారు.

ఊరూరా.. 'హర్ ఘర్ తిరంగా'



బొబ్బిలి: హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



వంగర: వంగరలో ర్యాలీ



రాజాం : 78వ స్వాతంత్య్ర దినోత్సవ కృత్యంలో పెనుబాక పాఠశాల విద్యార్థులు

బొబ్బిలి: పట్టణంలోని ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై బుధవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో టీపీఆర్‌ఓ జగన్మోహనరావు, ఏటీ నాయుడు, సీఎంఎం రాము, రామలక్ష్మి, సీఆర్పీలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల అక్షర రూపం

రాజాం : మండలంలో పెనుబాక గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు వినూత్నంగా ఆహ్వానం పలికారు. బుధవారం పాఠశాల ఆవరణలో 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 78ఆకారంలో కూర్చుని కృత్యం నిర్వహించారు. ఈ కృత్యం పలువురిని ఆకట్టుకుంది.

అంగన్‌వాడీ కేంద్రంలో...

తెర్లాం: మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త వై.శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రీస్కూల్ పిల్లల్లో దేశ భక్తిని పెంపొందించేందుకు చిన్నారులతో దేశభక్తుల వేషధారణలు వేయించారు.

సారధిలో..

రాజాం సిటీ: చిన్నారులు పాఠశాల స్థాయి నుంచే దేశభక్తి పెంపొందించుకోవాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.మధుసూధనరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి సారధి ఎంపీపీ పాఠశాలలో హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జెండా పండుగ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సంగంనాయుడు, ఉపాధ్యాయులు పి.గోవిందరావు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా త్రివర్ణ పతాకం ఎగరాలి

వంగర: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఇంటింటా త్రివర్ణ పతాకం ఎగరాలని ఏపీఎం మీసాల చక్రపాణి తెలిపారు. బుధవారం మండల కేంద్రం వంగరలో ఆజాద్ అమృత మహోత్సవంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలతో ర్యాలీ చేపట్టారు. ప్రతీ ఇంటా సెల్ఫీ తీసుకొని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఓ లోపింటి త్రినాథ్, ఏపీఎం తెర్లి మంగమ్మ, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

రేగిడి : ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలని ఏపీఎం గోవిందరావు మహిళలకు సూచించారు. మండలంలోని రేగిడి, ఉప్పరనాయుడువలస, చాటాయవలస తదితర గ్రామాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ స్వాతంత్య్రం ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



రాజాం సిటీ: సారధి పాఠశాలలో త్రివర్ణ పతాకాలతో విద్యార్థులు



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ వేషధారణాల్లో ప్రీస్కూల్ పిల్లలు



రేగిడిలో జాతీయ జెండాపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం తదితరులు

20 నుంచి ఓటర్ల సర్వే



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బొబ్బిలిరూరల్: ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు వంటి అంశాలపై ఈ నెల 20 నుంచి ఇంటింటి సర్వే చేపట్టాలని తహసీల్దార్ ఎం.శ్రీను ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండలంలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులను కొత్త ఓటర్లగా నమోదు చేయాలన్నారు. ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన, మరణించిన వారి ఓట్లను తొలగింపు ప్రక్రియను చేపట్టాలని సూచించారు. ఓటరు జాబితాలోని ఓటరు ఫొటోలు స్పష్టంగా లేకుంటే వాటిని సరి చేయాలన్నారు. ఓటర్లు పెరిగితే కొత్త పోలింగ్‌స్టేషన్ గుర్తించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియను అక్టోబర్ 18 నాటికి పూర్తి చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఆర్ఐ, సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు ఈ క్రాప్ చేయించుకోవాలి

రేగిడి: మండలంలోని రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని చాటాయవలస, వన్నలి, అక్కన్న అగ్రహారం, ఉప్పరనాయుడువలస తదితర గ్రామాల్లో మొక్కజొన్న పంట ఈ-క్రాప్ నమోదును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేయించుకుంటే ప్రభుత్వం రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు వీలుంటుందన్నారు. రైతులు సహకరించాలని ఏఓ సూచించారు.

నేత్రదానంపై అవగాహన కల్పించాలి

రాజాం సిటీ: నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని ఆప్తాల్మిక్ అధికారి, రొటేరియన్ సప్పటి వసంతరావు అన్నారు. స్థానిక నర్సింగ్ కళాశాలలో విద్యార్థినిలకు నేత్రదాన ఆవశ్యకతపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో పది రోజుల్లో జాతీయ నేత్రదాన పక్షోత్సవం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులంతా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవగాహన లేకపోవడంతో ఎంతో మంది మరణిస్తున్నారని, ఇది చాలా బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రజలు స్వచ్ఛందంగా ప్రజలు నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చేలా ప్రేరణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కళావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు

బొబ్బిలి: పట్టణంలోని అభ్యుదయ విద్యాసంస్థల అధినేత మర్రాపు కూర్మినాయుడు(నాని మాస్టారు) మాతృమూర్తి మహాలక్ష్మి ఇటీవల మృతి చెందారు. ఈమె సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హాజరై మహాలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాని మాస్టారు, అభ్యుదయ ప్రిన్సిపాల్ శారదలను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బొత్స కాశి నాయుడు, భమిడిపాటి విశ్వనాథ శర్మ తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యసేవలు

రేగిడి : మండలంలోని రేగిడి, బూరాడ పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారులు డాక్టర్ అసిరినాయుడు తెలిపారు. మండలంలోని దేవుదళ, బూరాడ, ఉంగరాడ, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు బుధవారం నిర్వహించారు. ఆరోగ్యసూత్రాలు వివరించారు. పోషణ ద్వారా అందిస్తున్న ఆహారంలోని గొప్పతనాన్ని తెలియజేశారు. ఆరోగ్యంగా ఉండడం ద్వారా కలిగే ప్రయోజనాలను వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవామృతంతో చీడపీడల నివారణ

- జీవామృతంతో చీడపీడలు నివారించవచ్చు

రేగిడి : రైతులు సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు చీడ పీడలు నివారించేందుకు జీవామృతం ఎంతో ఉపయోగపడుతుందని వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ ప్రకృతి వ్యవసాయ విభాగం ఐసీఆర్పీ పైల తవిటినాయుడు అన్నారు. మండలంలోని చాటాయవలస గ్రామంలో రైతులకు జీవామృతం తయారీ విధానంపై ఐసీఆర్‌పీలతో బుధవారం అవగాహన కల్పించారు. ఈ విధానంలో రైతులు తక్కువ ఖర్చుతో పంటలను చీడపీడల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆహారాన్ని పండించుకోవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పాదిలాపు సురేష్, కూనుబిల్లి రమణ, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

రాజాం సిటీ: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులు రైతులకు ఉపయోగపడే విధంగా చేపట్టాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు, ఏపీఓ కె.సాయిరాం అన్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉద్యానవన పనులతో పాటు మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేపట్టాలని సూచించారు.

సహారా బాధితుల ర్యాలీ

రాజాం సిటీ: తాము దాచుకున్న సొమ్ములు తక్షణమే చెల్లించాలని సహారా బాధితులు ఆందోళన చేశారు. రాజాంలోని సహారా కార్యాలయం నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఖాతాదారులను మోసం చేసే విధంగా కేంద్రమంత్రి మాట్లాడడం సరికాదని తీవ్రంగా ఖండించారు. పిల్లల పెళ్లిళ్లు, ఇతర అవసరాల కోసం డబ్బులు దాచుకున్నామని, వాటిని తిరిగి ఇవ్వకుండా తాత్సారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు.

ధర్నా

బొబ్బిలి: సహారా ఖాతాదారులకు డిపాజిట్లు చెల్లిస్తామని చెప్పినప్పటికీ వారు రావడం లేదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ సాక్షిగా అవాస్తవాలు మాట్లాడటం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు, సహారా బాధితుల సంఘం జిల్లా కన్వీనర్ బి.లక్ష్మీదాసు అన్నారు. పట్టణంలోని పలు రహదారుల గుండా బుధవారం ర్యాలీ నిర్వహించిన బాధితులు చర్చి సెంటర్‌లో మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహారా ఖాతాదారుల సొమ్ము చెల్లించాలంటూ కొన్నేళ్ల నుంచి పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం సహారా యాజమాన్యానికి కొమ్ము కాస్తూ వస్తోందన్నారు. ప్రజలను, ఖాతాదారులను పక్కదారి పట్టించేందుకు కేంద్ర మంత్రి తప్పుడు ప్రకటనలు చేశారన్నారు. సీపీఎం జిల్లా నాయకులు ఎస్.గోపాలం, కేఎల్ నాయుడు, ఐదు మండలాలకు చెందిన బాధితులు ధర్నాలో పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టికి పాటుపడాలి



సర్పంచ్‌ల శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: గ్రామాల్లో చెత్త నుంచి సంపదను సృష్టించేందుకు సర్పంచ్‌లు కృషి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు బుధవారం ముగిసాయి. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సంయుక్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీల అభివృద్ధి చేసుకొనేందుకు శిక్షణా కార్యక్రమాల్లో నేర్చుకున్న అనేక విషయాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గ్రామాల్లో వీధి లైట్ల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు, చెత్తశుద్ధి కేంద్రాల నిర్వహణ, ఈ-పంచాయతీ, పంచాయతీల్లో అభివృద్ధి ప్రణాళికల తయారు వంటి వాటిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల ఈఓపీఆర్‌డీ నీలిమ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి సమైక్యంగా పని చేయాలి

- ఎన్ఐఆర్‌డీపీ డైరెక్టర్ నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఐఆర్‌డీపీ డైరెక్టర్ నాగరాజు

బొబ్బిలి రూరల్: గ్రామాల అభివృద్ధి అధికారులు, ప్రజాప్రతినిధులు సమైక్యంగా కలసి పనిచేస్తేనే సాధ్యపడుతుందని ఎన్ఐఆర్‌డీపీ డైరెక్టర్ నాగరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు చివరిరోజు బుధవారం నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీలకు వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఇరువురిపైనా ఉందన్నారు. అలాగే సాగునీటి వనరులను బాగు చేసుకుని పంటలకు సరపడా నీటినిల్వలు ఉండేలా చూడాలని అన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, వర్మీకంపోస్టులను ఏర్పాటు చేసుకుని పంచాయతీలకు అదనపు ఆదాయాలను సమకూర్చుకోవాలని తెలిపారు. పంచాయతీలకు అదనంగా వచ్చే ఆదాయాలపై దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీఓ పి.రవికుమార్, ఈఓపీఆర్‌డీ భాస్కరరావు, జేఈ శ్రావణ్‌కుమార్, ఉపాధి హామీ జేఈ కళ్యాణచక్రవర్తి, ఇతర అధికార సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

రాజాం : రాజాంలో సన్‌రైజ్ ఆస్పత్రి పక్కన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్నట్టు పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ బుధవారం తెలిపారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఈ వేడుకలకు హాజరు కానున్నారని అన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అంతా రావాలని కోరారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయండి

రామభద్రపురం: ప్రభుత్వ భూముల ఆక్రమణలను అడ్డుకోవాలని జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంకు ప్రహరీ పక్కన, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సుమారు 18 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు(టీడీపీ) ఆక్రమణలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు రావడంతో తన అనుచరులతో బుధవారం ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కొన్ని కోట్ల విలువ చేసే స్థలాన్ని ఏ పార్టీ వారైనా ఆక్రమణలకు పాల్పడితే హైకోర్టుకు లాగుతానని హెచ్చరించారు. జాతీయ రహదారి పక్కన విలువైన స్థలం ఉండటంతో కబ్జాకోరుల కన్నేశారని, తక్షణమే అధికారులు స్పందించి సర్వేరాళ్లు పాతడంతో పాటు ప్రభుత్వం భూమి అని బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు మహంతి ధనంజయరావు, సారికి అవినాష్, బెల్లాన ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.